తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఈఈ అభ్యర్థులు

ఏఈఈ ఫలితాల కోసం అభ్యర్థుల ధర్నా

- గాంధీభవన్‌లో మోకాళ్ల పై నిరసన
- టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడి
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి 3 నెలలైనా ఫలితాలివ్వలేదని ఆవేదన
- పోస్టింగ్ ఆర్డర్ల కోసం డిమాండ్

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (ఏఈఈ) పోస్టుల తుది ఫలితాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో వందల మంది ఏఈఈ అభ్యర్థులు మంగళవారం ధర్నా చేశారు. గాంధీభవన్ మెట్లమీద బైఠాయించి ఏఈఈ తుది ఫలితాలు విడుదల చేయాలని, పోస్టింగ్ ఆర్డర్లు కూడా ఇచ్చి, తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపు మోకాళ్ల మీద కూర్చొని నిరసన తెలిపారు. 'వీ వాంట్ జస్టిస్' అంటూ ఫ్లకార్డులను ప్రదర్శించారు. తమ డిమాండ్లకు గతంలో మద్దతు పలికి ప్రభుత్వంతో పోరాటానికి సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంకట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మూడు నెలల క్రితమే ఏఈఈ పోస్టుల కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేశారని, ఫలితాలు ప్రకటించకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని కూడా ఏఈఈ అభ్యర్థులు ముట్టడించారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ గేటు దూకి కార్యాలయం లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయకపోతే దశలవారీగా నిరసనలు చేపడతామని అభ్యర్థులు హెచ్చరించారు. ధర్నాకు అన్ని జిల్లాలకు చెందిన అభ్యర్థులు స్వచ్ఛందంగా హాజరయ్యారు.

2022లోనే ఏఈఈ నోటిఫికేషన్

రాష్ట్రంలో రోడ్డు భవనాలు, నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, పబ్లిక్‌హెల్త్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల్లో ఉన్న ఏఈఈ పోస్టుల భర్తీకి గత బీఆర్ ప్రభుత్వం 2022 సెప్టెంబర్‌లో 1,540 పోస్టులతో భారీ నోటిఫికేషన్ ఇచ్చింది. 2023 జనవరి 22న తొలి పరీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్ విధానంలో రీఎగ్జామ్ నిరుడు మే 8, 9, 21, 22 తేదీల్లో జరిపారు. ఆగస్టు 7న ఫైనల్ కీ విడుదల చేశారు. సెప్టెంబర్ 20న జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్) ప్రకటించారు. ఈ ఏడాది మార్చి 18 నుంచి 23 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అప్పటి నుంచి తుది ఫలితాలు ఇవ్వకుండా ప్రభుత్వమే కావాలని జాప్యం చేస్తున్నట్టు బాధిత అభ్యర్థులు ఆరోపించారు.

అభ్యర్థులు ఆందోళన పడకండి: బల్మూరి

కొందరు రాజకీయ లబ్ధి కోసం విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. ఏఈఈ అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా వారు తనను సంప్రందిస్తే సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ దృష్టికి వచ్చిన సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

నియామకప్రతాలు ఇవ్వక పోవడం బాధాకరం: హరీశ్

రాష్ట్రంలో ఏఈఈ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయినా ప్రభుత్వం తుది ఫలితాలు ప్రకటించి అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వకపోవడం చాలా బాధాకరమని మా జీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీభవన్ వద్ద నిరసన తెలిపిన ఏఈఈ అభ్యర్థులకు సంఘీభావం ప్రకటించారు. మంత్రులకు, అధికారులకు ఎన్నిసార్లు అభ్యర్థులు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నియామక పత్రాలు ఇవ్వాలని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

సీఎంగారూ.. న్యాయం చేయండి!

- ముఖ్యమంత్రి నివాసం ఎదుట 'గురుకుల' అభ్యర్థుల ధర్నా
- మోకాళ్ల మీద కూర్చొని దాదాపు 300 మంది నిరసన
- నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణ
- కోర్టు తీర్పు సైతం అమలు చేయడం లేదని ఆవేదన
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఎదురైన నిరసన సెగ
- సంక్షేమభవన్ దగ్గర గురుకుల అభ్యర్థుల ధర్నా

హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ సంక్షేమభవన్ వద్ద గురుకుల అభ్యర్థుల నిరసన

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): 'గురుకుల' నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పలు జిల్లాలకు చెందిన అభ్యర్థులు మంగళవారం ఉదయం సీఎం నివాసం ఎదుట ధర్నా చేశారు. మోకాళ్లపై కూర్చొని సుమారు 300 మంది నిరసన వ్యక్తం చేశారు. 'సీఎం గారూ న్యాయం చేయండి' అంటూ చేతులెత్తి వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకులాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్, లైబ్రేరియన్ తదితర 9,210 పోస్టులకు గురుకుల బోర్డు వరుసగా నోటిఫికేషన్లు ఇచ్చి, ఒకేసారి పరీక్షలు నిర్వహించిందని చెప్పారు. కొందరు అభ్యర్థులు రెండుమూడు పోస్టులకు ఎంపికయ్యారన్నారు. వారు ముందుగా చిన్న పోస్టుల్లో చేరి, ఆ తర్వాత పెద్ద పోస్టుల ఫలితాలు రాగానే వదిలి వెళ్లిపోతున్నారని తెలిపారు. రీలిక్విష్మెంట్ విధానం పాటించకపోవడంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉండిపోతున్నాయని చెప్పారు. ఇలా సుమారు 1500–2000 పోస్టులు ఖాళీగా మిగిలిపోతున్నాయని తెలిపారు. రీలిక్విష్మెంట్ విధానంలో మెరిట్ జాబితాలోని తర్వాతి విద్యార్థులతో వాటిని భర్తీ చేయాలంటూ తాము హైకోర్టును ఆశ్రయించామని గుర్తుచేశారు. కోర్టు తమకు అనుకూలంగా ఈ ఏడాది మార్చి 26న మధ్యంతర ఉత్తర్వులు వెలువరించిందని చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని గురుకుల బోర్డును కోరగా ఎన్నికల కోడ్ పేరుతో ఇన్నాళ్లూ సాగదీశారని విమర్శించారు. ఇప్పుడు స్కూళ్లు కూడా ప్రారంభం అవుతున్నాయని, తమకు న్యాయం ఎప్పుడు జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసే తప్పిదాలతో తమ జీవితాలు ఆగమవుతున్నాయని, న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

సంక్షేమభవన్ ఎదుట నిరసన

అభ్యర్థులు ఉదయం 6 గంటలకు సీఎం నివాసానికి చేరుకోగా.. సుమారు రెండు గంటల నిరసన అనంతరం అధికారులు అభ్యర్థులను కలిశారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వగా, వారు సీఎంను కలిసిన తర్వాతే వెళ్తామని తేల్చి చెప్పారు. దీంతో నలుగురు అభ్యర్థులను లోనికి తీసుకెళ్లారు. సచివాలయానికి వెళ్లి సీఎంవో కార్యదర్శి సంగీత సత్యనారాయణతో మాట్లాడాలని సూచించారు. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వచ్చారు. ఆయన తిరిగి వెళ్తున్న సమయంలో మల్లన్న కారును అభ్యర్థులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసేలా సీఎంకు సూచించాలని కోరారు. కొందరు అభ్యర్థులు చేతులెత్తి వేడుకున్నారు. అయినా ఆయన పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అనంతరం అభ్యర్థులు మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమభవన్ వద్దకు వెళ్లారు. గురుకుల బోర్డు కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంక్షేమభవన్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నలుగురు అభ్యర్థులు సచివాలయానికి వెళ్లి సీఎంవో కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. తమ పరిస్థితిని వివరించడంతోపాటు కోర్టు ఆదేశాలను ఆమెకు అందజేశామని అభ్యర్థులు తెలిపారు. తదుపరి బోర్డు మీటింగ్‌లో ఈ అంశంపై చర్చించేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

వేతనాల వెతలు

- ప్రభుత్వమే న్యాయం చేయాలి
- సీఎం నివాసంలో నిజామాబాద్ ఏఎన్ఎంల డిమాండ్

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): తమకు వేతనాలు ఇప్పించాలంటూ నిజామాబాద్ జిల్లాకు చెందిన ఏఎన్ఎంలు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వచ్చారు. కొన్ని నెలలుగా తమకు వేతనాలు అందడం లేదని, జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. గతంలోనూ ఓ సారి సీఎంను కలిసేందుకు వచ్చామని, ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత పరిశీలిస్తామని చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్రమంతటా వేతనాలు అందుతున్నాయని, ఒక్క నిజామాబాద్ జిల్లాకు చెందిన ఏఎన్ఎంలకు మాత్రం రావడం లేదని వాపోయారు. సీఎం సిబ్బంది వారి నుంచి వినతిపత్రం తీసుకొని, పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.

పెండింగ్ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తరు?

- ఆర్థికశాఖ చుట్టూ ప్రదక్షిణలు
- అధికారులు స్పందించడం లేదని బాధితుల ఆవేదన

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆర్థికశాఖ వద్ద పేరుకుపోయిన బిల్లుల బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. మెడికల్ బిల్లులు, సాలరీ ఏరియర్స్, ఇన్సూరెన్స్, జీపీఎఫ్ వంటి అనేక రూపాల్లో ఉన్న బిల్లులు సకాలంలో చెల్లించకుండా ఆర్థిక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. సచివాలయంలో అర్జీలు ఇస్తున్నప్పటికీ పట్టించుకునే వారు ఎవరూ లేరని, కనీసం సరైన సమాధానం చెప్పేవాళ్లు కూడా ఎవరూ లేకుండా పోతున్నారని బాధితులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మూడు నెలలుగా రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల పేరుతో బిల్లులు చెల్లించకుండా సర్కారు కాలయాపన చేసింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం, ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో బిల్లుల కోసం బాధితులు మళ్లీ రాష్ట్ర సచివాలయంలోని ఆర్థికశాఖ అధికారుల చుట్టు తిరుగుతున్నారు. టోకెన్ నంబర్లతో ఆయా కార్యాలయాల్లో అర్జీలతోపాటు టోకెన్ నంబర్లను ఇస్తున్నారు. రాష్ట్ర సచివాలయం సిబ్బందికి కూడా సకాలంలో బిల్లులు చెల్లించడం లేదంటూ సచివాలయం ఉద్యోగులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గురుకులాల నిర్వీర్యానికి కుట్ర

- గురుకులాల్లో చదువుతున్న 4లక్షల మంది విద్యార్థులను రోడ్డున పడేస్తారా?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులను అక్కున చేర్చుకొని, నాణ్యమైన విద్యనందిస్తున్న గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతున్నదని మాజీ విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. గురుకులాల మీద అక్కసు వెళ్లగక్కడం మాని, వాటిని బలోపేతం చేయాలని ప్రభుత్వానికి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. గురుకులాలతో మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఆమె స్పందించారు. రాష్ట్రంలోని 1200కుపైగా గురుకులాల్లో నాలుగు లక్షలకుపైగా విద్యార్థులు చదువుకుంటున్నారని, వారందనీ రోడ్డునపడేస్తారా? అని నిలదీశారు. సీఎం ఇలా మాట్లాడటమంటే పేద, బడుగు, బలహీనవర్గాలకు ద్రోహం చేయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ చొరవతో తెలంగాణ గురుకులాలు ఆదర్శంగా నిలిచాయని, అనేక రాష్ట్రాలు వీటిపై అధ్యయనం చేస్తున్నాయని గుర్తు చేశారు. నేడు గురుకులాల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉన్నదని, సిఫారసు లేఖలు ఇచ్చినా సీట్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని, ఇలాంటి గురుకులాలను నిర్వీర్యం చేస్తారా? అని ప్రశ్నించారు. వారు నేడు జేఈఈ, నీట్‌లలో ర్యాంకులు సాధించి గొప్ప స్థానాలకు ఎదుగుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు 930 మంది డాక్టర్లు, 1,517 మంది ఇంజినీర్లుగా తయారయ్యారని, ఇది గురుకులాలు సృష్టించిన సంపద అని పేర్కొన్నారు. గురుకులాల్లోను అగ్రికల్చర్ కాలేజీ, రెండు లా కాలేజీలను తాము ఏర్పాటుచేశామని, ఇలాంటివి దేశంలో ఎక్కడా లేవని గుర్తుచేశారు. సాక్షాత్తు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇందుకు ప్రశంసలు కురిపించిందని తెలిపారు.

ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ కుర్చీ లొల్లి

- యాదాద్రి జిల్లా పరిషత్ సమావేశంలో రసాభాస
- చైర్మన్ సందీప్‌రెడ్డి, సామేల్ మధ్య మాటల యుద్ధం
- వేదికపై ఎందుకు కూర్చోవద్దని సామేల్ చిటపట

యాదాద్రి భువనగిరి, జూన్ 11 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మధ్య మాటల యుద్ధం నడిచింది. ఇద్దరి మధ్య వాడివేడిగా చర్చ జరిగింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే మందుల సామేల్ వచ్చారు. వేదికపై కూర్చునేందుకు వెళ్తుండగా.. చైర్మన్ సందీప్‌రెడ్డి సభ్యుల స్థానంలో కూర్చోవాలని సూచించారు. దాంతో సామేల్ కింద సభ్యులు కూర్చున్నచోట ముందు వరుసలో కూర్చున్నారు. ఆ తర్వాత భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సైతం వచ్చి సామేల్ పక్కనే కూర్చున్నారు. కొద్దిసేపటికే మందుల సామేల్ కుర్చీ లొల్లి షురూ చేశారు. ఎమ్మెల్యేలం వేదికపై ఎందుకు కూర్చోవద్దని ప్రశ్నించారు. కింద కూర్చోవాలని జీవో కాపీ ఉన్నదా? ఉంటే ఇప్పుడే చూపించాలంటూ స్వరాన్ని పెంచారు. పంచాయతీరాజ్ చట్టంలో ఉన్నదని సందీప్‌రెడ్డి చెప్పే ప్రయత్నం చేసినా వినకుండా తనకు కలెక్టర్ సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. జడ్పీ సమావేశానికి, కలెక్టర్‌కు సంబంధం ఉండదని సందీప్‌రెడ్డి చెప్పినా వినిపించుకోలేదు. 'నువ్వేంది చెప్పేది.. గత సమావేశాల్లో కూర్చున్నాం.. ఇప్పుడెందుకు కూర్చోవద్దు.. అంటూ భీష్మించారు. సమావేశం ఎమ్మెల్యేల కోసం కాదు.. రాజ్యాంగం గురించి తెలుసుకోండి.. ఏక వచనంతో మాట్లాడుతూ నోరు జారుతున్నారు.. గతంలోనూ నోరు జారారు.. మర్యాద కాపాడుకోవాలి' అంటూ సందీప్‌రెడ్డి హితవు పలికారు. జడ్పీ సీఈవో అయినా సమాధానం ఇవ్వాలని సామేల్ మళ్లీ పట్టుబట్టారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చైర్మన్ నిర్ణయం మేరకు వేదికపైకి ఆహ్వానిస్తారని సీఈవో శోభారాణి వివరణ ఇచ్చారు.

బూడిదనూ వదలని పొన్నం

- రాష్ట్రంలో ఆర్‌పీ ట్యాక్స్ దందా
- ఫ్లైయాష్ రవాణాలో కుంభకోణం
- రోజుకు 300 లారీలు.. ఒక్కో దానికి 30 వేల అక్రమ సంపాదన
- ఎన్టీపీసీ తీరుపై ఢిల్లీలో ఫిర్యాదిస్తాం
- అక్రమ రవాణాను అడ్డుకుంటాం
- అధికారుల వివరాలు రెడ్‌బుక్‌లో
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

తెలంగాణభవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రులు ఏ రంగాన్నీ వదలకుండా కుంభకోణాలకు పాల్పడుతున్నారని, బూడిదను కూడా వదలలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. రామగుండం ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ తరలింపులో పొన్నం ప్రభాకర్ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఒక్కో మంత్రి ఒక్కో కుంభకోణానికి పాల్పడుతున్నారని, తాజాగా రేవంత్, పొన్నం (ఆర్‌పీ) టాక్స్ వసూలు చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీపీసీ నుంచి అనుమతికి మించి బూడిదను రవాణా చేస్తూ రోజుకు రూ.90 లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఈ మొత్తాన్ని పొన్నం అన్న కొడుకు అనూప్ వసూలు చేస్తున్నారని వెల్లడించారు. 16 టైర్ల లారీలో 36 టన్నులు, 14 టైర్ల లారీలో 32 టన్నుల చొప్పున ఫ్లైయాష్ తరలించాల్సి ఉండగా, 72 టన్నుల వంతున తరలిస్తున్నారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వే బిల్లులను మీడియాకు చూపించారు. రోజుకు 300 లారీల చొప్పున రవాణా చేస్తున్నారని, ఒక్కో లారీపై రూ.30 వేల చొప్పున సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న 13 లారీలను తాను స్వయంగా హుజూరాబాద్‌లో పట్టుకోగా, రెండు లారీలనే సీజ్ చేశారని మండిపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఒత్తిళ్లకు రవాణా శాఖ అధికారులు లొంగుతున్నారని ఆయన విమర్శించారు. అక్రమ రవాణాను బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకుంటారని హెచ్చరించారు.

ఓవర్‌లోడ్ లారీలతో ప్రమాదాలు

ఫ్లైయాష్ ఓవర్‌లోడ్ లారీలతో రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని కౌశిక్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఇంజినీరింగ్ విద్యార్థి అఖిల్‌ను ఫ్లైయాష్ లారీ బలి తీసుకున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. తరలిస్తున్న ఫ్లైయాష్ వివరాలను ఎన్టీపీసీ ఎందుకు దాస్తున్నదని నిలదీశారు. ఎన్టీపీసీ అధికారుల తీరుపై ఢిల్లీలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఫ్లైయాష్ ఓవర్‌లోడ్ దందాను ఆపకపోతే తమ పార్టీ ఎమ్మెల్యేల బృందం రామగుండం ఎన్టీపీసీని సందర్శిస్తుందని, తమ క్యాడర్ ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందని ప్రకటించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేస్తున్న అధికారుల వివరాలను రెడ్‌బుక్‌లో నమోదు చేస్తున్నామని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం రాజీనామా చేస్తాం: ఎమ్మెల్యే సంజయ్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 13 హామీలను ఆగస్టు 15లోగా అమలు చేస్తే హరీశ్‌రావు మాత్రమే కాకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం రాజీనామా చేస్తామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సవాల్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి ఆరోపణలు నిరాధారం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ బూడిద రాజకీయం చేస్తున్నదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఫ్లైయాష్ కుంభకోణం అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. మంగళవారం ఆయన సచివాలయం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ఎన్టీపీసీ పనులు ప్రారంభించినప్పటి నుంచి బూడిదను రైతులకు ఉచితంగా ఇచ్చామని, అయినా మంత్రిపై రూ.100 కోట్ల అవినీతి ఆరోపణలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. 2022 నుంచి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో టెండర్ ద్వారా ఎన్టీపీసీ బూడిదను అమ్ముతున్నారని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమీ ఉండదని పేర్కొన్నారు. ఎన్టీపీసీ లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. తన అవినీతి, అక్రమాలపై విచారణకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

కమీషన్ కోసం కాంగ్రెస్ నేతల దౌర్జన్యం

బీఆర్ఎస్ నేత బైక్‌ను లాక్కెళ్లిన కాంగ్రెస్ నాయకులు

నల్లబెల్లి, జూన్ 11: బోరు వాహనాల కమీషన్ ఇవ్వకపోవడంతో కొందరు కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా బీఆర్ఎస్ నేత బైక్‌ను లాక్కెళ్లిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో చోటుచేసుకున్నది. బాధితుడి కథనం మేరకు.. కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేసిన భూములకు విద్యుత్తు సరఫరా చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.700 కోట్లు మంజూరు చేసింది. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఉపసర్పంచ్ గాదం సంధ్య భర్త రాజ్‌కుమార్ తన బోరు వాహనంతో పట్టాలు కలిగిన పోడు భూముల్లో బోర్లు వేశాడు. తమ పార్టీ ఎమ్మెల్యే అనుమతితో బోర్లు వేస్తున్నాడనే సాకుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన మేడేపల్లి ఉపసర్పంచ్ భర్త మోహన్‌నాయక్‌తో పాటు అదే పార్టీకి చెందిన వంగర వెంకన్న, ఆవుల ఐలయ్య, జనగాం రాజు, అక్కపెల్లి రమేశ్ బోరు బండి నడిపినందుకు తమకు కమీషన్ కింద రూ.28 వేలు ఇవ్వాలని రాజ్‌కుమార్‌ను వేధించారు. ఆ కమీషన్ ఇవ్వడం లేదని ఆయన బైక్‌ను బలవంతంగా లాక్కెళ్లారు. ఇప్పటికైనా కమీషన్ ఇవ్వకుంటే ఫారెస్ట్ అధికారులతో తన బోరు వాహనాన్ని సీజ్ చేయిస్తామని బెదిరిస్తున్నారని రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పు తీరుస్తావా.. చస్తావా?

- కాంగ్రెస్ నేత బెదిరింపులు
- గోదాములో చెట్టుకు కట్టేసి దాడి
- కాపాడాలని బాధితుడి వేడుకోలు

రాజన్న సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో గాయాలను చూపుతున్న రాజ్‌కుమార్

సిరిసిల్ల టౌన్, జూన్ 11: అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించలేదని సిరిసిల్లకు చెందిన ఓ వ్యక్తిని బంధించి.. విచక్షణారహితంగా దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో బాధితుడు గుండెల్లి రాజ్‌కుమార్ తన గోడును మీడియా ముందు వెళ్లబోసుకున్నాడు. కొద్దినెలల క్రితం అవసరం నిమిత్తం పట్టణానికి చెందిన నరేశ్ వద్ద రూ.8 లక్షలు అప్పుగా తీసుకున్నట్టు రాజ్‌కుమార్ తెలిపాడు. తిరిగి చెల్లించడంలో ఆలస్యం కావడంతో నరేశ్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేతతో కలిసి సోమవారం తన ఇంటికి వచ్చాడని తెలిపాడు. అప్పు విషయం మాట్లాడుదామని బండిపై కాంగ్రెస్ నేతకు చెందిన గోదాము వద్దకు తనను తీసుకెళ్లినట్టు చెప్పారు. అక్కడికి చేరుకోగానే ఎనిమిది మంది తనను చెట్టుకు కట్టేసి ఇష్టారీతిన దాడి చేశారని ఆరోపించాడు. వెంటనే అప్పు చెల్లించాలని, లేకుంటే ఇక్కడే చంపేస్తామని బెదిరించారని వాపోయాడు. దాడి ఘటన గురించి ఎవరికి చెప్పినా ప్రాణాలతో ఉండవంటూ బెదిరించారని చెప్పాడు. పోలీసులు వెంటనే కాంగ్రెస్ నాయకుడితోపాటు నరేశ్‌ను అరెస్ట్ చేసి తనకు ప్రాణరక్షణ కల్పించాలని రాజ్‌కుమార్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశాడు.

మద్యం అనుమతులపై విచారణ జరపాలి

- అనుమతులు ఎందుకిచ్చారు.. రద్దు ఎందుకు చేశారు?
- బాధ్యులెవరో తేల్చాలి.. మంత్రి రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలి
- బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మన్నె క్రిశాంక్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడంపై విచారణ జరిపి ఇందుకు బాధ్యులెవరో తేల్చాలని బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో క్రిశాంక్ మాట్లాడుతూ.. మంత్రి జూపల్లి సోం డిస్టిలరీస్ విషయంలో అనుసరించిన వైఖరి అక్షేపణీయంగా ఉన్నదని చెప్పారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతినే విధంగా ప్రభుత్వం కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. అవినీతి గురించి ప్రశ్నిస్తే మంత్రి జూపల్లి సోం డిస్టిలరీస్‌పై రకరకాల వైఖరుల తీసుకుని చివరకు తోకముడిచారని